క్లుప్తంగా

న్యాక్‌లో మూడు నెలల ఉచిత శిక్షణ

మాదాపూర్: మాదాపూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ అధ్వర్యంలో ఎస్సీ, బీసీ–సీ వర్గానికి చెందిన బీ.ఈ లేదా బీ.టెక్ సివిల్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ల కోసం మూనెలల ప్లేస్‌మెంట్ లింక్డ్ ఫినిషింగ్ స్కూల్ ప్రోగ్రామ్‌ను ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణను ఇవ్వనున్నారు. ఉచిత భోజన వసతి కల్పించనునారు. 100 శాతం ప్లేస్‌మెంట్‌లను కల్పించనున్నటు నిర్వాహకులు తెలిపారు. శిక్షణలో చేరడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులు వి.భార్గవాచారి ట్రెనింగ్ కోఆర్డినేటర్ ఫోన్. 7097114947, బి.వినోద్ నాయక్ ఫోన్. 8309758627లలో సంప్రదించగలరు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మియాపూర్: బృందవన్ కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్‌ను నిలిపివేయడం జరుగుతుందని ఏఈ హరిసింగ్ అన్నారు. బుధవారం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బృందవన్ కాలనీ, భావ్యాస్ నందనవనం, వర్టెక్స్ సద్గురు అపార్ట్‌మెంట్, అదేవిధంగా గౌతమీనగర్ 11కేవీ ఫీడర్ పరిధిలోని గౌతమినగర్, శ్రీనివాస్‌కాలనీ, లేక్వ్యూ కాలనీలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయడం జరుగుతుందని తెలపారు.

వసంత సిటీ ఫీడర్ పరిధిలో..

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వసంత సిటీ ఫీడర్ పరిధిలోని సైబర్ వ్యాలీ, సైబర్ విలేజ్, సంకల్ప అపార్ట్‌మెంట్స్, వసంత విల్లాస్, అలేఖ్య ఫీడర్ పరిధిలోని న్యాక్ ఎంట్రెన్స్ రోడ్, అపర్ణ అపార్ట్‌మెంట్స్, ఇజ్జత్‌నగర్ విలేజ్, జూబ్లీ గార్డెన్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నాలుగేళ్ల చిన్నారికి అరుదైన చికిత్స

శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్‌లో 4 ఏళ్ల చిన్నారికి హాప్లోయిడెంటికల్ స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను వైద్యులు విజయవంతంగా చేశారు. మంగళవారం డాక్టర్ అశోక్ కుమార్ వివరాలను వెల్లడించారు. దీపికా(4) చిగుళ్లలో రక్తస్రావం, తరచూ ముక్కు నుంచి రక్తం కారడం కారణంగా హాస్పిటల్ చేరారు. ఆమె ప్లేట్ లెట్ కౌంట్ 3000 మాత్రమే ఉండటంతోనే ఈ పరిస్థితి ఉందన్నారు. స్టెరాయిడ్‌తో చికిత్స ప్రారంభించడంతో ఆమెకు పుట్టుకతోనే అరుదైన ఈ వ్యాధి (అమెగా కార్యోసైటిక్ థ్రోంబోసైటోపెనియా) ఉన్నట్లు నిర్ధారణ అయినట్లు తెలిపారు. దీపిక తల్లిని దాతగా తీసుకొని హాప్లోయిడెంటికల్ స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విధానంతో చికిత్సను అందజేశారు. ఏఓఐ ప్రాంతీయ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ.. అత్యాధునిక చికిత్సలను అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ అందించి రోగులకు మెరుగైన వైద్యం అందిస్తుందన్నారు.

21న హెచ్‌సీయూలో జాతీయ స్థాయి సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఈనెల 21న జాతీయ స్థాయి సదస్సును నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారని తెలుగు విభాగం అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. హెచ్‌సీయూ తెలుగు శాఖ, గురజాడ ఫౌండేషన్ అమెరికా సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు హెచ్‌సీయూలోని మానవీయశాస్త్రాల విభాగం ఆడిటోరియంలో ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ముఖ్యఅతిథిగా హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు హాజరై సదస్సును ప్రారంభిస్తారన్నారు. మానవీయశాస్త్రాల విభాగం డీన్ ఆచార్య కృష్ణ, ఢిల్లీ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఏల్చూరి మురళీధర్‌రావు, ఆచార్య గోపాలకృష్ణ(అమెరికా) పాల్గొంటారన్నారు.

పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న రవికుమార్ యాదవ్‌తో మహిళా నాయకురాళ్లు

గచ్చిబౌలి: నూతన పార్లమెంట్ భవనంలో మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం తెలిపిన కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీకి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్ యాదవ ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1996లో అటల్ జీ హయాంలో తొలిసారిగా మహిళ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో పెట్టిన సరైన బలం లేక ఆమోదం పొందలేదన్నారు. మోదీ హయాంలో నారీ శక్తి వందన పేరిట బిల్లుకు కేంద్రం ఆమోదం తెలపడం, బిల్లును ప్రవేపెట్టడం అభినందనీయమన్నారు. రాఘవేంద్రరావు, నవతారెడ్డి, సింధురెడ్డి, రాధాకృష్ణ యాదవ్, పద్మ, వినీత, మేరీ, పార్వతి, అరుణ పాల్గొన్నారు.

జై జై గణేశా..

శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్లలోని కాలనీలు, బస్తీల్లో పలు కూడళ్లు, ప్రధాన రోడ్ల పక్కన తొలిపూజలు అందుకునే గణనాథులు కొలువుదీరారు. సోమవారంతో ఆరంభమైన ప్రత్యేక పూజలు మంగళవారం కూడా ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలను నిర్వహించి ఆయా కాలనీ, బస్తీవాసులకు ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల ఆయా గణేష్ ఉత్సవ కమిటీ పర్యవేక్షణలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

– శేరిలింగంపల్లి జోన్ బృందం



పూజలు చేస్తున్న ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే గాంధీ, నాయకులు, ఉత్సవసమితి సభ్యులు



గోపన్‌పల్లి రంగనాథస్వామి ఆలయం వద్ద.. కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, రవికుమార్‌యాదవ్



కాటమయ్య యూత్ అసోసియేషన్ గణనాథుడి వేడుకల్లో..



గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో..



ఖాజాగూడలో.. కొమిరిశెట్టిసాయిబాబా తదితరులు



చందానగర్‌లో.. కార్పొరేటర్ మంజులా రఘునాథ్‌రెడ్డి, ఉత్సవకమిటీ సభ్యులు



టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి ఆలయంలో..

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న బిహార్ హస్తకళామేళా సందర్శకులను ఆకట్టుకుంటుంది. కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను నగరవాసులు కొనుగోలు చేస్తున్నారు. మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆంపిథియేటర్‌లో మానస స్కూల్ ఆఫ్ డాన్స్ అకాడమీ గురువు ప్రణవి తుమ్మటి శిష్యబృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనను నిర్వహించారు. ఇందులో విఘ్నరాజం భజేయ, వినాయకకౌత్వం, మూసికవాహన, ముదాకరతమోదకం, గరుడ గమన, ముద్దుగారే యశోద, శివస్తోత్రం తదితర అంశాలను కళాకారులు అంజనీ, కీర్తన, దుర్గ, రేణు, స్నేహ, దీక్షశ్రీ, రోహన్, శ్రీవిద్య, సహస్ర, యుక్త, కృతిక, మోక్ష, అబిజ్ఞ, హిమ, భవ్యశ్రీ, తేజస్వీ, సాయినేత్ర శ్రీ అక్షర, సమన్విత, గగన, భవజ్ఞ తదితరులు పాల్గొని సందర్శకులను ఆకట్టుకున్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం



గవర్నర్ చేతులు మీదుగా బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

హఫీజ్‌పేట్: తెలంగాణ విమోచన దినోత్సవంలో భాగంగా రాష్ట్రపతి భవనలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని చందానగర్ గంగారంలోని మహిళా దక్షిత సమితి కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్విజ్ పోటీల్లో సారా, సూర్య మనోజ్, సారా జార్జ్, స్నేహలత, లక్ష్మీకు ద్వితీయ బహుమతులు తీసుకున్నారు. నాట్యంలో శివానికి నాల్గవ స్థానం, రాష్ట్రీయ రాగ కన్సోలేషన్‌లో ఆల్బర్ట్ పీటర్, ఆన్‌లెన్సీ పీటర్, విజయలక్ష్మి, కేఆర్ శర్మ, అసిన మరియాసిబిక్, క్రిస్టినా వినోద్, దేవికలు బహుమతులు పొందారు. ఈ బహుమతులు సోమవారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతులు మీదుగా విద్యార్థులు అందుకున్నారు.

కేబుల్‌బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ నియంత్రణకు మరో లింకురోడ్డు



స్థలాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్

గచ్చిబౌలి: దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ నియంత్రణకు మరో లింకురోడ్డు నిర్మాణం చేయాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. అందుకు సన్నాహాలు కూడా మొదలెట్టారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ మాదాపూర్‌లోని దుర్గం చెరువు కేబుల్‌బ్రిడ్జి వద్ద స్థలాన్ని అయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఎన్‌సీసీ కంపెనీ ఈ లింకురోడ్డు నిర్మాణానికి సీఎస్ఆర్ పద్దతిన నిర్మించేందుకు ముందుకు రావడంతో స్థల పరిశీలనను ఉన్నతాధికారులు చేశారు. దుర్గం చెరువు ప్రధాన గేటు నుంచి ఫుట్‌పాత్ మీదుగా టీసాట్ వైపు కేబుల్ బ్రిడ్జి వరకు లింకురోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుంది. ఈ రోడ్డు కేబుల్ బ్రిడ్జి రోడ్డుకు ప్రత్యామ్నాయంగా మారనుంది. ఈ రోడ్డు ద్వారా మాదాపూర్, జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 36కు వెళ్లేవారు ట్రాఫిక్ అంతరాయం లేకుండా వెళ్లడానికి మార్గం సుగమం అవుతుంది. ఈ రోడ్డు నిర్మాణానికి భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని, అంతేకాకుండా ఇతరత్రా ఈ రోడ్డులోని వాటిని వెంటనే మార్చాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. అందుకోసం జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. యుటిలిటీ షిఫ్టింగ్ భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసిన వెంటనే పనులను ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఈ శంకర్‌నాయక్, జోనల్ సిటీప్లానర్ మల్లికార్జున్, శేరిలింగంపల్లి ఏసీపీ మెహ్రా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని గడ్డపోతారం గ్రామపంచాయతీ పరిధిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను మంగళవారం తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ జయశంకర్ నారాయణ జేసీబీతో కూల్చివేయించారు. 11వ సర్వే నంబర్ గల



ప్రభుత్వ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టిన సహించేది లేదని హెచ్చరించారు.

పాత దుస్తులు దానమివ్వండి

సాక్షి, సిటీబ్యూరో: నిరుపేదల సహాయార్థం.. ప్రముఖ ఎన్‌జీఓ నిర్మాణ్ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్‌లో 'బైగాన్ ఫ్యాషన్ డొనేషన్ డ్రైవ్'ను నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. దీనిలో భాగంగా నగరవాసులు మాల్లో ఏర్పాటు చేసిన కియోస్క్‌లో తమ దగ్గర ఉన్న వినియోగంలో లేని దుస్తులను విరాళంగా ఇవ్వవచ్చుననీ, బదులుగా, ఐఎస్–రివార్డ్స్ లాయల్టీ ప్రోగ్రామ్ ద్వారా 100 వరకూ ఐఎస్ నాణేలు పొందవచ్చుననీ వివరించారు. ఈ డ్రైవ్ అక్టోబర్ 5 వరకూ కొనసాగుతుందన్నారు.

శరవేగంగా శ్మశానవాటిక నిర్మాణ పనులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రాంనరేష్‌నగర్ శ్మశానవాటికలో జరుగుతున్న సుందరీకరణ, అభివృద్ధి నిర్మాణ పనులను కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాంనరేష్ నగర్ శ్మశానవాటిక అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. ఈ శ్మశానవాటికలో అంత్యక్రియ ప్లాట్ ఫారం, అడ్మినిస్ట్రేషన్ భవనం, అంతర్గత రోడ్లు, టాయిలెట్లు వాటర్ ఫౌంటైన్, స్నానాల గదులు, మనిషి జీవిత చరిత్ర తెలిపే చిత్రాలు, ప్రహరీ నిర్మిస్తున్నామని తెలిపారు. అదే విధంగా అంత్యక్రియలు సజావుగా ప్రశాంత వాతావరణంలో జరుపుకునే విధంగా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ గోవర్ధన్, ఏఈ రాజీ, వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీవాసులు నక్క శ్రీనివాస్, వెంకటయ్య యాదవ్, సిందం శ్రీకాంత్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమా చెక్కు అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని గుమ్మడిదల గ్రామానికి చెందిన రైతు చాకలి కిష్టయ్య ఇటీవల ఆనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో రైతుబీమా పథకం ద్వారా మంజూరైన రూ.5లక్షల చెక్కును మంగళవారం జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, వ్యవసాయశాఖ ఏఓ శ్రీనివాస్‌రావు మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఈఓ చందర్, నాయకులు పాపిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

గొల్ల, కురుమల సంక్షేమానికి కృషి



రామచంద్రాపురం(పటాన్‌చెరు): గొల్ల, కురుమల సంక్షేమానికి కృషి చేస్తోందని తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి అన్నారు. మంగళవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలమెలలో పలువురికి గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్‌రెడ్డి, నాయకులు సాయిచరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ హబ్‌గా తెలంగాణ

● రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు తదితరులు

గచ్చిబౌలి: తెలంగాణ మెడికల్ హబ్‌గా మారుతోందని, హైదరాబాద్ కేంద్రంగా దేశంలో ఎక్కడ లేని విధంగా వైద్య సేవలు అందిస్తున్నారని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీష్ రావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలో పీఐ హెల్త్ కేన్సర్ హాస్పిటల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అమెరికా, బ్రెజిల్, చైనా, ఆస్ట్రేలియా దేశాల్లో సేవలందిస్తున్న పీఐ హెల్త్ హాస్పిటల్ నగరంలో కార్యకలాపాలను ప్రారంభించడం అభినందనీయమన్నారు. కేన్సర్‌పై రిసెర్చ్ చేయాల్సిన అవసరం ఉందని, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వైద్యం అందించాలని ఆయన సూచించారు. యూఎస్–ఎఫ్‌డీఏ మాజీ డివిజనల్ ఆంకాలజీ డైరెక్టర్ గ్లోబల్ సీఈఓ డాక్టర్ జియోఫ్ కిమ్ మాట్లాడుతూ.. భారత దేశంలో కేన్సర్ కేర్ కోసం సేవలందిస్తామని చెప్పారు. అత్యాధునికమైన సాంకేతిక పరిజ్ఞానంతో రోగులకు వైద్య సేవలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఐ హెల్త్ గ్లోబల్ సీఓఓ డాక్టర్ బొబ్బిరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ వినాయక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో గులాబీ జెండా ఎగురవేస్తాం



మధురానగర్‌లో పాదయాత్రలు చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, సాయిబాబా, నాయకులు, అధికారులు

రాయదుర్గం: శేరిలింగంపల్లిలో భారీ మెజార్టీతో మరోసారి గులాబీ జెండా ఎగురవేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. మంగళవారం గచ్చిబౌలి డివిజన్‌లోని మధురానగర్, ప్రశాంత్ హిల్స్ కాలనీలో ఆయన మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పాదయాత్రలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా శేరిలింగంపల్లి తొమ్మిదేళ్లలో రూ.9 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతోనే పెద్ద ఎత్తున నిధులు మంజూరయ్యాయని, రవాణా సౌకర్యం మరింత మెరుగు పర్చేందుకు, ట్రాఫిక్ సమస్య తీర్చేందుకు మెట్రో సౌకర్యం విస్తరణ, రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం భారీగా చేయడం లింకురోడ్ల నిర్మాణం వంటి చేపట్టడం జరిగిందన్నారు.

ప్రత్యేక పూజలు..

మధురానగర్‌లోని ఆలయాల్లో ఎమ్మెల్యే గాంధీ, మాజీ కార్పొరేటర్ సాయిబాబా, జీహెచ్‌ఎంసీ అధికారులు, నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎదురుగడ్డ మైసమ్మ ఆలయం, పోచమ్మ ఆలయంలో ఆయన పాదయాత్రల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, డీఈ విశాలాక్షి, ఏఈ జగదీష్, వేణుగోపాల్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, నాయకులు గణేష్‌ముదిరాజ్, రాజునాయక్, రమేష్‌గౌడ్, నరేష్,శ్రీనివాస్‌యాదవ్, చెన్నంరాజు, సత్యనారాయణ, జగదీష్, నారాయణ, గోవింద్, శ్రీనివాస్, సతీష్, నవాజ్, అనీల్, మహేందర్, మల్లేష్, వినోద్‌తోపా పాల్గొన్నారు.

ఉర్దూ భాష విద్యార్థులకు శిక్షణ ఇవ్వడమే 'మనూ' లక్ష్యం



సర్టిఫికెట్లు పొందిన వారితో 'మనూ'వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్

రాయదుర్గం: జాతీయ విద్యావిధానం–2020 మాతృభాషలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని చెబుతోందని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఐటీఐ విభాగం ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ ట్రైనింగ్ నిర్వహణలో శిక్షణ పొందిన ఐటీఐ విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాతీయ నూతన విద్యా విధానంలో ప్రత్యేకంగా నైపుణ్యాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కూడా సూచించామన్నారు. ఉర్దూ భాష మాట్లాడే విద్యార్థులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇవ్వడమే విశ్వవిద్యాలయం ఏర్పాటు లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్, ఐటీఐ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా ఆజమ్, బోధకుడు భిక్షపతి పాల్గొన్నారు.

కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో తొలి మోకీలు మార్పిడి శస్త్ర చికిత్స



నర్సమ్మతో వైద్యుల బృందం

గచ్చిబౌలి: కొండాపూర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో తొలి మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా చేసినట్లు వైద్యులు తెలిపారు. హఫీజ్‌పేట్‌కు చెందిన నర్సమ్మ(70) కొంత కాలంగా మోకీలు నొప్పితో బాధపడుతోంది. ప్రైవేట్ వైద్యులను సంప్రదించగా మోకీలు మార్పిడి చేయాలని, లక్షల్లో ఖర్చు అవుతందని సూచించారు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో కుటుంబసభ్యులు కొండాపూర్ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి ఆర్థోపెడిక్ వైద్యులు మధుసూదన్, క్రాంతి శస్త్ర చికిత్స చేసి మోకీలు మార్పిడి చేయాలని నిర్ణయించారు. ప్రత్యేక ఇంప్లిమెంట్స్ తెప్పించినవెవైద్యులు ఈనెల 11న శస్త్ర చికిత్స చేసి మోకీలు మార్పిడి విజయవంతంగా చేసి మంగళవారం డిచ్ఛార్జీ చేశారు. ప్రభుత్వం కల్పించిన అత్యాధునిక వైద్య సదుపాయాలు, నిపుణులైన వైద్య బృందం ఉండటంతో శస్త్ర చికిత్స చేయగలిగామని డాక్టర్ మూర్తి తెలిపారు. శస్త్ర చికిత్స పాల్గొన్న డాక్టర్లు ఈశ్వర్, ప్రణతి, జాయిస్, ప్రియదర్శిని, విజయ కుమారి, మాలతీలను జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రాజు అభినందించారు.

సైబర్ వలలో ప్రైవేట్ ఉద్యోగి, గృహిణి

రూ.10.26 లక్షలను పోగొట్టుకున్న ఇద్దరు బాధితులు

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్ అంటూ వాట్సాప్ మెసేజ్ కు స్పందించిన ఇద్దరు భారీ నగదు పోగొట్టుకున్నారు. ఈ సంఘటనలు అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని బీరంగూడకు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఈనెల 11న పార్ట్ టైం జాబ్ పేరిట వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. అందులో వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చాడు. టాస్కులు పూర్తి చేస్తే పెట్టిన నగదుతోపాటు కమీషన్ వస్తుందని నమ్మించి, రెండు దఫాలుగా రూ. 5 లక్షల చెక్కులు వేయాలని చెప్పారు. అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా వేశాడు. తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదు, కమీషన్ చూపిస్తున్నారు. చివరిగా వీటిని ఇవ్వాలని అడగగా స్పందించలేదు. మోసపోయిన్నట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సాయిరాం ఎంక్లేవ్ కు చెందిన ఓ గృహిణికి ఈనెల 5న టెలిగ్రామ్ ద్వారా జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. అందులో వివరాలను నమోదు చేసి రూ. 26 వేలు నగదు పెట్టుబడి పెట్టి, ఇచ్చిన టాస్కులు పూర్తి చేసింది. చివరికి తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తి స్పందించ లేదు. దీంతో మోసపోయిన్నట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్, సోమవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసులను దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



గచ్చిబౌలి: చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ జేమ్స్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 15న సాయంత్రం 4గంటలకు ఓ గుర్తు తెలియని వ్యక్తి (40–45)ని మరో గుర్తు తెలియని వ్యక్తి కారులో తీసుకొచ్చి కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున మృతి చెందాడని కొండాపూర్ ఆస్పత్రి డాక్టర్ సంతోష్‌రెడ్డి డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించారు. ప్రమాదానికి గురైనట్లుగా మృతుడి శరీరంపై గాయాలున్నట్లు గచ్చిబౌలి పోలీసులు గుర్తించారు. మృతుడి వివరాలు, ఆస్పత్రిలో చేర్పించిన వ్యక్తి వివరాలు తెలిస్తేనే ఏమి జరిగిందనేది తెలుస్తుందని సీఐ పేర్కొన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడి అరెస్ట్

హఫీజ్‌పేట్: చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడిని మంగళవారం చందానగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఐ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్ మాణిక్‌నగర్‌కు చెందిన రమేష్ (21) సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం బాంబే కాలనీలో కూలీ పనులు చేస్తుంటాడు. ఈనెల 13న ఉదయం 10:30 గంటలకు నల్లగండ్ల కూరగాయాల మార్కెట్ వద్ద కొల్లూర్ తాండకు చెందిన లొక్కమ్మ సీతాఫలాలు విక్రయిస్తుంది. అక్కడ మాటువేసిన రమేష్ ఎవరు లేని సమయంలో ఆమె మెడలో ఉన్న 30 గ్రాముల బంగారు గొలుసును లాక్కుని పారిపోయాడు. ఆమె వెంటనే చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తులో భాగంగా పోలీసులు సీసీ టీవీలను పరిశీలించగా స్నాచింగ్‌కు పాల్పడింది రమేష్ అని నిర్ధారించారు. మంగళవారం ఉదయం 9 గంటలకు పటాన్ చెరువు లేబర్ అడ్డ వద్ద అనుమానంగా తిరుగుతుండగా అతడిని పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.